క్లుప్తంగా

ఎంఈఓకు ఫిర్యాదు



మద్దూరు: మండల కేంద్రంలోని గీతాంజలి పాఠశాలపై విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం ఎంఈఓ గోపాల్‌నాయక్‌కు ఫిర్యాదుచేశారు. విద్యార్థుల ఫీజులు ఇబ్బడిముబ్బడిగా పెంచుతున్నారని, ఫీజు కట్టని విద్యార్థులను పాఠశాల బయట నిలబెట్టుతున్నారని, తల్లి దండ్రులు పాఠశాలకు వెళ్లి ఇదేమని అడిగితే యాజమాన్యం దురుసుగా ప్రవర్తిస్తున్నారని పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదుచేసిన వారిలో నర్సింహులుగౌడ్, పాండు, రాజు, ప్రకాష్, రమేష్, వెంకట్ తదితరులు ఉన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి వార్షికోత్సవాలు




మరికల్: మండల కేంద్రంలోని రాయిచూర్ సమీపంలో పడమటి ఆంజనేయస్వామి ఆలయం నిర్మించి ఏడాది పూర్తిచేసుకోవడంతో గురువారం వార్షికోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ కాంతులు, పూలతో అలంకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పల్లకి సేవ నిర్వహించి, స్వామివారికి అభిషేక సహిత, సామూహిక, ఆకులపూజ నిర్వహించారు. అనంతరం అఖండ భజన చేశారు. భక్తులకు తీర్థప్రసాదలు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజరులు వెంకటేశ్వర్లశర్మ, వేణుగోపాల్‌శర్మ, సర్పంచ్ గోవర్ధన్, జగన్, రాజేశ్వర్‌రెడ్డి, రాంచంద్రయ్యగౌడ్, పూరోషోత్తంరెడ్డి, రమేష్, పుల్లయ్యగౌడ్, శ్రీనివాస్, కృష్ణచారి, వేణు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాంల పంపిణీ



కృష్ణా: మండల పరిధిలోని ఖాన్‌దొడ్డి ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రామ సర్పంచ్ జయలక్ష్మీ తిప్పయ్య, హెచ్‌ఎం శేఖర్, పాఠశాల చైర్మన్ మల్లికార్జున్‌ల ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్‌బుక్స్‌తోపాటు యూనిఫాంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మనఊరు– మనబడిలో భాగంగా విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ అశోక్, ఉపాధ్యాయులు శివరాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

పిడెంపల్లికి బస్సు నడిపించాలి



నారాయణపేట రూరల్: విద్యార్థులసౌకర్యార్థం దామరగిద్ద మండలం పిడెంపల్లికి ఆర్టీసీ బస్సర్వీస్‌ను నడిపించాలని ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్ డిమాండ్ చేశారు. గురువారం డీఎం లక్ష్మిసుధకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బస్సులేకపోవడంతో గేట్ వరకు 4కిలోమీటర్ల దూరం నడుచుకుంటు వచ్చి బస్సుఎక్కుతారని వాపోయారు. గ్రా మంలోకి బస్సువస్తే విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. నాయకులు నితిన్, రాజు, హరీష్ పాల్గొన్నారు.

అనర్హులే ఎక్కువ

ధన్వాడ: బీసీ కులాలకు ప్రభుత్వం అందిస్తున్న బీసీబంధు మొదటి విడతలో మండలంలోని 51 మందికి బీసీబంధు మంజూరైంది. ఇందులో అర్హుల కన్న అనర్హులే ఎక్కువ ఉన్నారని బీజేపీ రాష్ట్ర నాయకులు ఉదయభాను ఆరోపించారు. బీసీ బంధులో ప్రభుత్వం నుంచి నెలనెల జీతం తీసుకుంటున్న వారికి బీసీబంధు అదించారని ఆరోపించారు. ఇందులో 90శాతం మంది బీఆర్‌ఎస్‌కి చెందిన కార్యకర్తలు ఉన్నారని ఆరోపించారు. నర్సింహులు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలి

మరికల్: అర్హులను ఎంపిక చేయడంలో సర్పంచ్‌లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని తీలేర్ సర్పంచ్ రేవతమ్మ అన్నారు. తీలేర్‌లో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కులవృత్తులకు అందజేస్తున్న బీసీబంధులో ఆర్థికంగా ఉన్నా వారికే రూ. లక్ష ఆర్థికసాయం చేశారని, 50 ఏళ్ల నుంచి కులవృత్తిని నమ్ముకొని జీవిస్తున్న వారిని విస్మరించడం న్యాయం కాదన్నారు. దీంతో పాటు దళితబంధ, గృహలక్ష్మి, డబల్‌బెడ్రూం, ఆసరా పింఛన్లు అర్హులను ఎంపిక చేసేందుకు సర్పంచ్‌లకు అధికారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బంజరప్ప, శ్రీనివాస్, మల్లప్ప, కుర్మయ్య, ఆనందచారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయాల కిటకిట

- గృహలక్ష్మికి వెల్లువెత్తిన దరఖాస్తులు

మక్తల్/ మరికల్/ కృష్ణా/ధన్వాడ/ఊట్కూరు: నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన గృహలక్ష్మి దరఖాస్తులకు గురువారం చివరిరోజు కావడంతో లబ్ధిదారులతో తహసీల్దార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. మరికల్‌లోని తహసీల్దార్ కార్యాలయం తెరవకముందే వందల సంఖ్యలో లబ్ధిదారులు దరఖాస్తులతో ఆరుబయట వేచి చూశారు. గ్రామీణ ప్రాంత ప్రజలు ట్రాక్టర్లల్లో, ఆటోల్లో తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. అధికారులు రాగానే దరఖాస్తులు ఇవ్వడానికి లబ్ధిదారులు ఎగబడ్డారు. మీసేవ, జిరాక్స్ సెంటర్ల వద్ద ప్రజలు బారులుతీరారు. ప్రత్యేకంగా డెస్కులు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించారు. మూడురోజులు మాత్రమే గడువు ఇవ్వడంతో సరైన ధృవపత్రాలు లేక కొంత మంది లబ్ధిదారులు నిరాశతో వెనుదిరిగారు.



మరికల్ తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వడానికి ఎగబడ్డ లబ్ధిదారులు



మక్తల్ తహసీల్దార్ కార్యాలయంలో చెట్టుకింద కూర్చొని ఫారాలు రాస్తున్న లబ్ధిదారులు



ధన్వాడలో తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు



కృష్ణాలో తహసీల్దార్ కార్యాలయానికి ట్రాక్టర్లలో తరలివస్తున్న ప్రజలు

కొనసాగుతున్న గాలికుంటు నివారణ టీకాలు



మాగనూర్: పశుసంర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గాలుకుంటు టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సందర్భంగా గురువారం మండలంలోని ఉజ్జెల్లిలో పశువులకు గాలికుంటు టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా వెటర్నరీ అసిస్టెంట్ వినయ్ మాట్లాడుతూ.. పశువుల కాపరులు ముందు జాగ్రత్త చర్యగా వారి పశువులకు ఉచితగాలికుంటు టీకాలను వేయించుకోవాలని కోరారు. కార్యక్రమంలో యశోద, నాగప్ప, లక్ష్మి పాల్గొన్నారు.

మాజీ సైనికులకు సన్మానం



మద్దూర్: ఆజాదికా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండల బీజేపీ ఆధ్వర్యంలో మాజీ సైనికులకు సన్మానం చేశారు. దేశరక్షణ విషయంలో సైనికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పలువురు నాయకులు కొనియాడారు. మాజీ సైనికులు మాట్లాడుతూ.. యువత సైన్యంలో చేరేందుకు తమ వంతుగా శిక్షణ ఇచ్చి సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగామని, దేశ రక్షణకోసం సైన్యంలో చేరాలన్నారు. అనంతరం మాజీ సైనికులు శంకర్, రాము నాయక్, వినోద్ కాలేకర్, గోవర్ధన్‌రెడ్డిలను సన్మానించారు. ఇందులో బీజేపీ జిల్లా ఉపాధ్యాక్షుడు మదన్, నాయకులు వెంకటయ్య, సాయిలు, రవి కుమార్, రామకృష్ణ, భరత్, రాఘవేందర్ చారీ, హరీష్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితుడికి ఆర్థిక సాయం

మరికల్: మండల కేంద్రానికి చెందిన టైలర్ రాజశేఖర్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండటంతో టైలర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.15వేల ఆర్థికసాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో టైలర్ సంఘం మండల అధ్యక్షుడు మొగులయ్య, చంద్రశేఖర్, మొగులప్ప, రవి, తిమ్మయ్య, రవి, గోవర్ధన్, హరి, రాజు, శ్రీను, ఆంజనేయులు, రాజేందర్, రాము పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

మక్తల్: డబ్బులు ఇవ్వలేదని వ్యక్తిపై దాడిచేసిన సంఘటన మండలంలోని తిర్మలాపూర్ స్టేజీ వద్ద చోటుచేసుకుంది. వివరాలిలా.. దాసర్‌పల్లికి చెందిన బాలరాజు తన పొలానికి కొత్తపల్లికి చెందిన పస్పుల తాయప్ప అనే వ్యక్తి వద్ద ఫర్టిలైజర్ మందులు కొనుగోలు చేసి రూ.4 వే లు అప్పు పెట్టాడు. దీంతో ఈ విషయమై బాలరాజు, పసుల తాయప్ప మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో బాలరాజు కొడుకు శ్రీకాంత్ రావడంతో తాయప్ప పరారయ్యాడు. ఈ క్రమంలో బాలరాజుకు తలకు గాయంకావడంతో మక్తల్ పోలీస్‌స్టేసన్‌లో ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నియోజకవర్గ ప్రజలకు సేవ చేస్తా..

- ఫౌండేషన్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

మక్తల్: నియోజకవర్గ ప్రజల సంక్షేమంకోసం సేవ చేస్తానని టీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ బాలకృష్టారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని సంగంబండలో తాగునీటి ఎద్దడి ఏర్పడటంతో గ్రామస్తులు ఫౌండేషన్ చైర్మన్ బాలకిష్టారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన స్పందించి గ్రామంలో రూ. 3లక్షలతో పైపులైన్, తాగునీటి బోరువేయించి ప్రారంభించారు. పునరావాస కేంద్రంలో తాగునీటికొరత తీర్చడంపై గ్రామస్తులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 700మంది నిరుపేద మహిళలకు కుట్టుమిషన్లు ఉచితంగా పంపిణీ చేసినట్లు తెలిపారు. రెండోవిడతలో ఆత్మకూర్, అమరచింత మండలాలకు త్వరలోనే కుట్టుమిషన్లను అందజేస్తామన్నారు. విద్య, వైద్యం ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం జరుగుతుందని, సామూహిక వివాహాలతోపాటు అన్నిరంగాల్లో ప్రజలకు సేవచేయాలనే తపన ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం సాయిరెడ్డి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, ఎంపీటీసీ తిమ్మప్ప, మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, అనంతరెడ్డి, బాల్‌రాంరెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోరును ప్రారంభిస్తున్న బాలకిష్టారెడ్డి

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన

మక్తల్: మండలంలోని గురువారం మొబైల్ వ్యాన్‌లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌తోపాటు వీవీ ప్యాట్ ఏర్పాటుచేసి వాటిపై అధికారులు ఓటర్లకు అవగాహన కల్పించారు. మూడు నెలలో ఎన్నికలు రాబోతున్నందున ప్రజలు అందరూ ఓటు వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పేర్లు లిస్టులో ఉన్నాయా లేదా అని ఒకసారి చెక్‌చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవ్ రావు, ఎన్నికల డీటీ కాళప్ప పాల్గొన్నారు.

మాగనూర్: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును తప్పకుండా వినియోగించుకోవాలని ఆర్‌ఐ శ్రీశైల అన్నారు. గురువారం మండలంలోని వర్కూర్‌లో ఎన్నికల ఓటింగ్‌యంత్రంపై కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాట్‌లు పనిచేసే విధానంపై ఆయన గ్రామస్తులకు అవగాహన కల్పించారు. స్వయంగా ఓటువేసి అనుమానాలను నివృతి చేసుకునేందుకు డెమో ఈవీఎంలు ఏర్పాటుచేశారు. అవకాశాన్ని ప్రజలు, ఓటర్లు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఓబ్లాపూర్ సర్పంచ్ నిర్మలమ్మ, కానిస్టేబుల్ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



మక్తల్‌లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

ధర్నా వాల్‌పోస్టర్ విడుదల

మక్తల్: ఉపాధ్యాయుల సమస్యలపై ఈ నెల 12న జిల్లాకేంద్రంలో నిర్వహించనున్న ధర్నాకు సంబంధించి గురువారం పట్టణంలో యూపీఎస్‌పీసీ ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్ విడుదల చేశారు. సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మహాధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సూర్యచంద్ర, అనిల్‌గౌడ్, రాజు, పరంధాములు, మంజుల, శ్రీవిద్య, పరంజ్యోతి, చంద్రశేఖర్, శ్రీశైలం, లక్ష్మణ్ రులు పాల్గొన్నారు.



‘బీజేపీ నాయకులపై దాడులు సరికాదు’

ఊట్కూరు: బీజేపీ ఎస్సీమోర్చా ఆధ్వర్యంలో గురువారం మండలంలోని బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ దళితమోర్చా ప్రధాన కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్, ఎంఐఎం పార్టీల నాయకులు బీజేపీ కార్యకర్తలపై దాడులకు దిగుతున్నారని ఆరోపించారు. చోలంకి విజయ్ భార్యను ఎంఐఎం గుండాలు వేధిస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, దీంతో చోలంకి విజయ్ మనస్థాపానికి గురై నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆరోపించారు. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, ఎంపీటీసీ హన్మంతు, నాయకులు కృష్ణయ్యగౌడ్, కుర్వ ఆశప్ప, మల్లేష్, రమేష్ పాల్గొన్నారు.

నారాయణపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాద్బలంతోనే ఎంఐఎం దళితులపై దాడులు చేస్తున్నారని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కన్వీనర్ ఎస్.విజయ్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఎంఐఎం దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు.. బీఆర్‌ఎస్, ఎంఐఎం కలసి దళితులపై దాడులు చేస్తూ ప్రాణాలు హరిస్తు భూములు, ఆస్తులు లాక్కున్నారని విమర్శించారు. నాయకులు టి.అశప్ప, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, బీజేపీ పట్టణ అధ్యక్షుడు రఘురామయ్యగౌడ్, రమేష్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

సెకండ్ ఏఎన్‌ఎంల నిరసన

మరికల్: రెండో ఏఎన్‌ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించాలని గురువారం ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం జిల్లా నాయకులు కాశప్ప మాట్లాడుతూ ఎండో ఏఎన్‌ఎంల జీవితాలతో చేలగాటమాడటం ప్రభుత్వం మానుకోవాలని వారి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మాగనూర్: సెకండ్ ఏఎన్‌ఎంల సమస్యలను పరిష్కరించాలని గురువారం మండల పీహెచ్‌సీ ఆవరణలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు విధులను బహిష్కరించారు. ఏఎన్‌ఎం వరలక్ష్మి మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలను రెగ్యులర్ చేయాలని 11వ పీఆర్సీ ప్రకారం కనీసవేతనం రూ. 31వేలతోపాటు టీఏ, డీఏహెచ్‌ఆర్ ఇతర అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యాక్సిన్ అలవెన్స్ రూ. 2500 రూపాయలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.



మద్దూరులో పీహెచ్‌సీవద్ద దీక్ష చేస్తున్న ఏఎన్‌ఎంలు

ఊట్కూరు: రెండో ఏఎన్‌ఎంల పోస్టులను క్రమబద్ధీకరించాలని కోరుతూ గురువారం మండలంలోని పీహెచ్‌సీ ఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి ఏఎన్‌ఎంలు నిరసన చేపట్టారు. అనంతరం వినతిపత్రాన్ని డాక్టర్ అబీబ్‌కు అందించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు కవిత, మంజుల, మహేశ్వరి, సుజాత, శారద తదితరులు పాల్గొన్నారు.

కోస్గి: సెకండ్ ఏఎన్‌ఎంలను నేటికి రెగ్యులర్ చేయకుండా ప్రభుత్వం నోటిఫికేషన్ వేసి పరీక్షలు రాయమనడం ఎంత వరకు సమంజసమని ఏఎన్‌ఎంలు ప్రశ్నించారు. ఈమేరకు మండలంలోని గుండుమాల్ పీహెచ్‌సీఎదుట నల్లబ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ రద్దుచేసి కాంట్రాక్ట్‌పద్ధతిలో పనిచేస్తున్న రెండో ఏఎన్‌ఎం, ఈసీ ఏఎన్‌ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు భారతి, బాలమణి, చంద్రకళ, వెంకటమ్మ, అరుణ, కమల, వాణిశ్రీ, మాదవి తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: సెకండ్‌ఏఎన్‌ఎంలను క్రమబద్ధీకరించాలని పీహెచ్‌సీ ఎదుట గురువారం దీక్ష చేపట్టారు. తమ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఏలాంటి నోటిఫికేషన్ లేకుండా మమ్మల్ని క్రమబద్ధీకరించాలని కోరారు. గత 6రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుంచి ఏలాంటి స్పందన రాకపోవడంతో మౌనదీక్ష చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు రాజేశ్వరీ, గోవింద, జేరుషా, లక్ష్మిరాజ్యం, సావిత్రి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమం ద్వారానే సమస్యల పరిష్కారం

నారాయణపేట రూరల్: ఉద్యమం ద్వారానే ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించుకుందామని తపస్ జిల్లా అధ్యక్షుడు శేరికృష్టారెడ్డి అన్నారు. గురువారం జిల్లాకేంద్రంలోని శ్రీవివేకానంద మున్సిపల్ పార్క్ వద్ద ధర్నాచేసి కలెక్టర్ శ్రీహర్షకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టీచర్ల పదోన్నతులు, బదిలీలు చేపట్టడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కమిటీల పేరుతో పీఆర్‌సీ విషయంలో కాలయాపన చేస్తున్నారని, వెంటనే పెండింగ్ బిల్లులు, డీఏలను చెల్లించాలని డిమాండ్ చేశారు. 317జీఓలో స్థానికత నష్టపోయిన టీచర్లకు న్యాయం చేయాలన్నారు. జీఓ 79 ప్రకారం కారుణ్య నియామకాలు యుద్ధప్రాతిపదికన చేపట్టి ఆయా కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాకు మద్దతుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, రఘురామయ్యగౌడ్, రఘువీర్ యాదవ్, ఏబీవీపీ నాయకులు నరేష్, ఇంతియాజ్, వెంకటరమణ పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రసంగించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, గుంపుబాలరాజు, వెంకటయ్య, నర్సింహ, మల్లికార్జున్, సీతారాములు, శ్రీనివాస్‌రెడ్డి, మాణిక్‌ప్రభు, విశ్వనాథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, పారిజాత, కృష్ణవేణి, నర్మద తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న శేరికృష్టారెడ్డి

బీఆర్‌ఎస్ నాయకులను అరెస్ట్ చేయాలి

మరికల్: మండలంలోని వెంకటాపూర్‌లో నాలుగురోజుల క్రితం దళితుడిపై దాడిచేసిన బీఆర్‌ఎస్ నాయకులను వెంటనే అరెస్ట్‌చేయాలని బీఎస్పీ నియోజకవర్గ ఇంచార్జి శ్రీనివాస్ అన్నారు. గురువారం బాధితు డిని బీఎస్పీనాయకులు పరామర్శించారు. గ్రామంలో అధికార పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే అండతో దళితులపై దాడి చేసిన వ్యక్తులకు ఎమ్మెల్యే మద్దతు తెలుపడం న్యాయంకాదన్నారు. వెంటనే పోలీసులు వారిని అరెస్ట్‌చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. చంద్రయ్య, అశోక్, వెంకటయ్య, శ్రీకాంత్ పాల్గొన్నారు.

30న ప్రతిభ పురస్కారాలు ప్రదానం

మాగనూర్: జిల్లా వ్యాప్తంగా ఈ విద్యాసంవత్సరానికి గాను ప్రతి మండలంలో పదోతరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు, ఎస్‌ఐ పరీక్షలో ఎంపికైనా అభ్యర్థులకు ఈ నెల 30న మండలంలోని నేరడగంలో పశ్చిమాద్రి విరక్త మఠంలో ప్రతిభ పురస్కారాలు ప్రదాన కార్యక్రమం ఉదయం 10:గంటలకు ఉంటుందని పీఠాధిపతులు పంచమ సిద్ధలింగ మహాస్వాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యావేత్తలు, విద్యాభిమానులు, భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు.

‘గృహలక్ష్మి’లో రేషన్‌కార్డును తొలగించాలి

మాగనూర్: గృహలక్ష్మి పథకం అమలుకు అవసరమైన పత్రాల జాబితాలో నుంచి రేషన్‌కార్డును తొలగించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశా రు. ఆయన మాట్లాడుతూ.. రేషన్‌కార్డు లేనివారని గృహలక్ష్మి పథకానికి అర్హులుగా ప్రకటించాలన్నారు.మూడురోజుల సమయం ఇచ్చి ప్రజలను ఇబ్బందులకు గురిచేసిందని వెంటనే దరఖాస్తులకు గడువుపొడగించాలన్నారు.

విద్యార్థులకు క్రీడాపోటీలు

నారాయణపేట రూరల్: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని కోటకొండలోని జెడ్పీస్కూల్ విద్యార్థులకు గురువారం క్రీడాపోటీలను నిర్వహించారు. కబడ్డీ, ఖోఖో, రన్నింగ్ తదితర అంశాల్లో పీఈటీ రమణ ఏర్పాటుచేసిన పోటీలను హెచ్‌ఎం రవి కుమార్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని, ఆటలు ఆడటంతో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం



నారాయణపేట: మండలంలోని సింగారంలో గురువారం రేషన్ డీలర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రేషన్ డీలర్లకు కమిషన్ పెంచడం, రూ. 5 లక్షల బీమా సౌకర్యం, పనిచేస్తూ మరణిస్తే కుటుంబంలో ఒకరికి కారుణ్య నియామకం ద్వారా ఉద్యోగం తదితర వరాలు కురిపించారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సిద్రామప్ప, మాణిక్యప్ప, మల్లప్ప, ఇందిరమ్మ, నవనీత తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు



జిల్లావ్యాప్తంగా గురువారం పలువురు తహసీల్దార్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు. వివరాలిలా..

ధన్వాడ: మండల తహసీల్దార్‌గా సింధుజ బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన నాగలక్ష్మి మహబూబ్‌నగర్‌కు బదిలీకాగా ఆత్మకూరులో విధులు నిర్వహిస్తున్న సింధుజ ధన్వాడ మండల తహసీల్దార్‌గా గురువారం ఆమె బాధ్యతలు చేపట్టారు.

కోస్గి తహసీల్దార్‌గా..

కోస్గి: మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేసిన తహసీల్దార్ మమత నూతన మండలం కొత్తపల్లి తహసీల్దార్‌గా బదిలీ అయ్యారు. మహబూబ్‌నగర్‌లో పనిచేసిన శ్రీనివాసులును కోస్గి తహసీల్దార్‌గా బదిలీచేయగా గురువారం విధుల్లో చేరారు. మండల పరిధిలోని మీ సేవా ఆపరేటర్లతో నూతన తహసీల్దార్ ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా మెరుగైన సేవలు అందించాలని సూచించారు.



కృష్ణాకు దయాకర్‌రెడ్డి..

కృష్ణా: మండల తహసీల్దార్‌గా దయాకర్‌రెడ్డి గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో నర్వ మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహించి ఇక్కడకు బదిలీపై వచ్చారు. అదేవిధంగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వైపీ రమేష్ ప్రమోషన్‌పై వెళ్లడంతో ఆ స్థానంలో నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం కార్యాలయం సిబ్బంది సురేష్, మధన్‌మోహన్‌రెడ్డి, ఆంజనేయులు తహసీల్దార్‌కు సన్మానించారు.

కొత్తపల్లికి మమత..

మద్దూర్: నూతనంగా ఏర్పడిన కొత్తపల్లి మండల తహసీల్దార్‌గా మమత బదిలీపై వచ్చారు. కోస్గి తహసీల్దార్‌గా పనిచేస్తున్న మమతను కొత్తపల్లి తహసీల్దార్‌గా బదిలీ చేయగా గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషిచేస్తానని తహసీల్దార్ మమత తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం



ధన్వాడ: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన సింధుజకు గురువారం టీఎన్జీవోఎస్ మాజీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి స్వాగతం పలుకుతూ సన్మానం చేశారు. మండల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలరాజు, రాఘవేందర్‌రెడ్డి, వెంకట్‌రాములు, రాజేందర్, వెంకటేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

నల్ల చెరువు పరిశీలన

మక్తల్: మండలంలోని చిట్యాలలో నల్లచెరువును ఇరిగేషన్ అధికారులు ఏఈ వెంకటేశ్వర్లు గురువారం పరిశీలించారు. చెరువు అలుగు కట్టను మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదేవిధంగా హరితహారం కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ వద్ద మొక్కలు నాటేందుకు కూలీలు గుంతలు తవ్వుతున్నారని తెలిపారు. ఆయనతోపాటు సర్పంచ్ నర్సింహులు, చిట్యాల లక్ష్మన్, ఎంపీటీసీ రాంలింగప్ప పాల్గొన్నారు.

